# స్వర్గంలో జరిగిన పెళ్లా?




**శుక్రవారం** ఉదయం నుండి రాజా ఖంగారుగా ఉన్నాడు. అవాళ సావిత్రిని కలవమని వాళ్ల మావయ్య ద్వారా కబురుపెట్టడమంటే కబురుపెట్టాడు కానీ ఆమెను ఎక్కడకి రమ్మన్నాడో మర్చిపోయాడు. పబ్లిక్‌గార్డెన్సా? ఇందిరా పార్కా? సంజీవయ్య పార్కా? 'పాడు మతిమరుపు' తిట్టుకున్నాడు రాజా. ఈ మతిమరుపు గురించి మాట్లాడాలనే కదా సావిత్రిని రమ్మన్నది.

తీరా చేసి ఆమెను కలవకపోతే ఎలా?

సావిత్రి అతనికి కాబోయే భార్య. పెళ్లిచూపుల్లో చూడగానే నచ్చింది. రూపురేఖల్లోనే కాదు. సమర్థవంతురాల్లా కూడా అనిపించింది. అందుకే అన్న పెళ్లికి ముందే మంచీ చెడ్డా మాట్లాడడం అవసరం అనిపించింది. కానీ మాట్లాడడం ఎలా? ఎక్కడ కలవాలో మర్చిపోయాడే!

సాధారణంగా ఇలా మర్చిపోతాననుకున్నవన్నీ రాజా ఒక కాగితం మీద రాసి పెట్టుకుంటాడు. అది ఎక్కడ పెట్టాడు చెప్మా? చొక్కా జేబులో వెతికాడు. లేదు. అది రాసిపెట్టుకున్ననాడు వేసుకున్న చొక్కా ఏదా అని ఆలోచించాడు. గుర్తురాలేదు. పోనీ ప్యాంటు? తలవిదిలించుకున్నా అదీ గుర్తుకు రాలేదు.

తనకు మతిమరుపు ఎక్కువన్న మాట రాజా ఒప్పుకుంటాడు. 'నేను ముందు పుట్టానో, మతి మరుపు ముందు పుట్టిందో అని ఓసారి పందెం వేసుకున్నాం కూడా. కానీ రిజల్టు సంగతి అడక్కండి – మర్చిపోయేను. అసలు నేను పుట్టినప్పుడు మంత్రసాని గురించి మా అన్నయ్యను పంపిస్తే వాడు ఆ విషయం మరచిపోయి మేట్నీ సినిమాకు వెళ్లిపోయేట్ట. తరువాత మరొకరెవరో వెళ్తే, మా ఇంటి అడ్రసు మరిచిపోయి మంత్రసాని మరోళ్లింటికి వెళ్లిందట' అంటూంటాడు.

ఇటువంటి మతిమరుపు ఉగ్గుపాలతో పెరిగిన అతనికి 'ఆబ్సెంట్ మైండెడ్‌నెస్' సహజంగా వచ్చేసింది. ఎలిమెంటరీ స్కూలు దగ్గర్నుంచీ అటెండెన్స్ వేసేటప్పుడు పక్కవాడు గుర్తు చేస్తే తప్ప 'ప్రెజెంట్ సార్' అనేవాడు కాదు. హోమ్ వర్క్ చేయడం మరిచిపోవడం వల్లా. ఓ రోజు టైమ్ టేబుల్ పుస్తకాలు మరో రోజు తీసి కెళ్లడం వల్లా, ఎన్నిసార్లు దెబ్బలు తిన్నాడో లెక్కలేదు. పైగా మేష్టారు బయట కనబడితే గుర్తు పట్టలేక 'విష్' చేయకపోవడమూ, వాళ్ల ఆగ్రహానికి గురికావడమూ జరిగేది.

కొన్ని సందర్భాల్లో ఈ మతిమరుపు మరీ ఏడిపించేది. ముఖ్యంగా సైకిల్ బయటపెట్టి హోటల్‌కైనా, సినిమాకైనా, ఎవరింటికైనా వెళ్ళినప్పుడు తాళం చెవి చేతిలో పట్టుకున్నట్టు ముందు గుర్తుండేది కానీ, తరువాత అది అస్సలు కనబడేది కాదు. సీటు కింద్రా, పక్క – కుర్చీ మీదా, డబ్బులు తీయవలసిన అవసరం పడిన ప్రతీ చోటా వెతికితే ఓ పావు గంటకు దొరికేది. బయట కెళ్లేసరికి రెండో పరీక్ష కాచుకొని ఉండేది. సైకిలు గుర్తుపట్టడం ఎలా? అన్నీ ఒకలాగే కనబడేవి. (సైకిళ్లకు కూడా రిజిస్ట్రేషన్ నెంబరుంటే ఎంత బాగుండేది!) ఎక్కడ పెట్టాడో గుర్తుండేది కాదు. కాస్సేపు అటూ ఇటూ తచ్చాడి, ఓ సైకిలు ఎంచుకొని, తాళం చెవి తిరగేసి పెట్టి కుస్తీ పడుతూంటే స్టాండ్‌వాడు అనుమానంగా చూస్తూ ఉంటే...వివరాలు ఎందుకు? ఇలాటివి ఎన్నో.

'అబ్సెంట్ మైండెడ్ ప్రొఫెసర్' అని చిన్నప్పట్నుంచి అందరూ అనడంతో అటువంటి వాళ్లందరికీ టీచరుద్యోగమే బెస్టు అన్న అభిప్రాయానికి వచ్చాడు రాజా. ఏ బ్యాంక్‌లోనో అయితే మూడో రోజుకి ఇంటికెళ్లిపోవాలి. అయినా ఇంటి కెళ్లనిస్తారో, లేదా తక్కువైన డబ్బు కట్టేదాకా జైలుకెళ్లమంటారో!.

టీచరు ఉద్యోగంలో కూడా తిప్పలు లేకపోలేదు. ఓ క్లాసుకి బదులు మరొక క్లాసుకి వెళ్ళకుండా చూసుకోవడం, ఓ పాఠానికి బదులు మరొకటి చెప్పకుండా ఉండడం, ఓ సబ్జక్టులో పరీక్ష పెడతానని చెప్పి మరొక దాంట్లో పెట్టకుండా జాగ్రత్త పడడం – ఎంత కష్టపడినా, కాగితం మీద రాసి పెట్టుకొని గుర్తు పెట్టుకోజూసినా స్కూల్లో చేరిన ఆర్నెల్లలోనే

రాజాకు 'మతి మరుపు మాధవయ్య మేస్టారు' నిక్‌నేమ్ వచ్చేసింది.

ఇంట్లో వాళ్లంతా ఇలాటివాడు ఎలా బతుక్కొస్తాడో అని అతని ముందే బెంగపడుతూండడంతో రేపు సంసారం ఏర్పడ్డాక ఎలాగాని అతనికి దిగులు పట్టుకొంది. కూరలు, సరుకులూ తెచ్చేటప్పుడు కొట్టువాడికి ఎక్కువ డబ్బులిచ్చేయడమూ, బస్ కండక్టరు నుండి, ఆటోవాడి నుండి చిల్లర పుచ్చుకోవడం మర్చిపోవడమూ లాంటివి చేసి కొంప గుండం చేస్తానని భయం వేస్తూండేది.

కానీ అతనికొక ధైర్యం - స్వర్గంలో పెళ్లిళ్లు చేసేటప్పుడు దేవుడు సరైన జోడీలు కుదురుస్తాడంటారు. జంటలను బాలెన్స్ చేయడం అక్కడే జరుతుందట. అందుకే లోకం సజావుగా సాగుతోందట. అతివృష్టి, అనావృష్టి లేకుండా, పిసినారి వాడికి ఖర్చుదారి పెళ్లాన్నీ, తెలివి తక్కువ అమ్మాయికి తెలివైన మొగుడినీ కుదిర్చి ఇంచు మించు అందరూ సమానంగా ఉండేటట్లు దేవుడు చూస్తాడట. తనలో ఉన్న మతిమరపు లోటు భర్తీ చేయడం దేవుడి బాధ్యతే కాబట్టి దానిని కాంపెన్సేట్ చేసే తగిన భార్యని ఆయనే కుదురుస్తాడని అతనికి గట్టి నమ్మకం ఉండేది.

సావిత్రిని చూడగానే అతనికా నమ్మకం బలపడింది పెళ్లి చూపుల్లోనే! తక్కిన విషయాలు ఇంట్లోవాళ్లకి నచ్చేయి కాబట్టి సంబంధం త్వరగా కుదిరిపోయింది. పెళ్లి నెల రోజులుండనగా అతన్నొక ఆలోచన తొలిచి వేయసాగింది– 'భార్యాభర్తల మధ్య మంచి అవగాహన ఉండాలంటే అర మరికలు లేకుండా ఒకరి లోపాలు ఒకరికి చెప్పుకోవాలి కదా! మరి నా ఈ మతిమరుపు లక్షణం ముందుగానే చెప్పడం భావ్యం, అవసరం కూడా. రేపు పెళ్లయ్యేక ఆమె పుట్టినరోజు మర్చిపోవచ్చు. సినిమాకు తీసుకెళతానని చెప్పి మరిచిపోయి ఇంటికి ఆలస్యంగా రావొచ్చు. పుట్టింటి నుండి తిరిగి వచ్చినప్పుడు రిసీవ్ చేసుకోవడం గుర్తురాకపోవచ్చు. తనకునుకొని ఇంటిపక్కావిడతో సరసమాడబోవచ్చు– ఇవన్నీ మనస్పర్థలకు దారి తీస్తే? తీస్తాయి. అందుకని మన అవలక్షణం ముందుగానే చెప్పుకుంటే మంచిది' అని ఆలోచించి సావిత్రి మావయ్య ద్వారా ఆమెకు కబురు పెట్టాడు – శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు పబ్లిక్ గార్డెన్స్‌లో కలవమని. ఆ విషయమే మరిచాడు.

తనను తాను తిట్టుకుని ఇందిరాపార్కు, సంజీవయ్యపార్కు, బ్రహ్మానందరెడ్డి పార్కు తిరిగి రాజా పబ్లిక్ గార్డెన్స్‌కి వచ్చేసరికి పది దాటింది. కనుచూపు మేరలో సావిత్రి కానరాలేదు. వేచి చూసి విసిగి వెళ్లిపోయుంటుందేమో ననుకున్నాడు. ఓ అరగంట అక్కడే తచ్చాడి, దగ్గర్లో ఉన్న ఆమె ఆఫీసుకి వెళ్లాడు.

సీటు దగ్గరకెళ్లి పలకరింపుగా నవ్వినా ఆమె తిరిగి నవ్వలేదు. 'హలో' అన్నా కళ్ళెగరేసింది. కానీ పలకరించలేదు. 'యస్' అంది సీరియస్‌గా. తప్పు తనది కాబట్టి, 'అయాంసారీ, లేటయింది. కారణాలు క్రమేపీ నీకు అర్థమవుతాయి..." అని మొదలుపెట్టాడు.

'మీరెవరు? ఏం మాట్లాడుతున్నారో నాకేం తెలియటం లేదు' అందామె.

ఎంత అలక మీద ఉన్నా మరీ ఇంత ఇదిగా మాట్లాడుతుందేమాని, అభిమానం పొడుచుకొచ్చి, పళ్లు గిట్టకరిచి, "నేను మీకు గుర్తులేనేమో, నాపేరు ఫలానా' అని పూర్తిపేరు, ఇంటిపేరుతో సహా వల్లించి మొహంలోకి తీక్షణంగా చూసాడు.

ఆశ్చర్యం! ఆమెలో ఏ రియాక్షనూ లేదు- కనుబొమలు ముడివేసి 'సోవాట్?' అన్నట్టు చూస్తోంది.

అతనికి ఏం చెయ్యాలో పాలుపోలేదు. పక్క సీటు వాళ్లు అప్పటికే వింతగా చూస్తున్నారు. రాజా చటుక్కున తలవంచి దగ్గరగా చేరి "సావిత్రి గారూ, మనం వచ్చే నెల పెళ్లి చేసుకోబోతున్నాం" అన్నాడు.

అప్పుడు చూసాడు - ఆమె ముఖంలో వెలుగు, సంతోషం, సిగ్గూ - అన్నీ కలగలిపి గత్తర బిత్తర అయిపోయింది. మాటలు కలగాపులగం అయిపోయాయి.

"అయాం సారీ, కూర్చోండి... పెళ్లి చూపుల్లో చూసేనే కానీ మీ ముఖం గుర్తు పట్టలేకపోయాను. మీ వాళ్లు నా ఫోటో తీసుకున్నారు కానీ, మీది ఇచ్చారు కారు. అదేమిటో పేరు చెప్పినా తట్టలేదు, మట్టి బుర్రని. ఎంతసేపూ చిక్కడపల్లి పెళ్లికొడుకు అని అనడమే కానీ పేరూ, అదీ...ఛ ఛ... అయాం సారీ అండి. కూర్చోండి. ఏం తీసుకుంటారు?"

"అది సరే, మీ మామయ్యగారు ఏమీ చెప్పలేదా?...నేను మీతో ప్రైవేటుగా మాట్లాడాలని..." అన్నాడు రాజా కుర్చీలో కూర్చుంటూ.

"చెప్పాడండీ...కానీ మర్చిపోయేను. ఇప్పుడు మిమ్మల్ని చూస్తే గుర్తుకొచ్చింది. అయినా అది ఫ్రైడే నాడు కదా, ఇవాళ ఇంకా శుక్రవారమేను. కలుద్దామండి, తప్పకుండా కలుద్దాం. నేనూ మీతో చాలా విషయాలు దాపరికం లేకుండా మాట్లాడాలి. ముఖ్యంగా నాకున్న ఈ మతిమరుపు రోగం గురించి..."

'భగవంతుడా! ఇది స్వర్గంలో కుదిరిన పెళ్లేనా!" అని వాపోయాడు రాజా.

('హాసం' మార్చి 2003)

